ప్రజాశక్తి
శనివారం 31 మే, 2025 5
శ్రీకాకుళం

కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు తహశీల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావు బాత్రూంలో మహిళా ఉద్యోగి వీడియో చిత్రీకరణ ఘటనపై ఆముదాలవలస సిఐ పి.సత్యనారా యణ, పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణలు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా కార్యాలయంలో మహిళా ఉద్యోగులతో విచారణ చేశారు. తహశీల్దార్ ఆర్.వెంకటేష్ సమక్షంలో చేపట్టిన విచారణలో మహిళా ఉద్యోగులు గతంలో సన్యాసిరావు కారణంగా ఎదుర్కొన్న లైంగిక వేధింపులను వివరించారు. బాదితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొన్న వేధింపులను ఒక్కొక్కరు పోలీసులకు వివరించారు. ఘటనపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిం చనున్నట్లు సిఐ తెలిపారు.

కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)

బీడుకు జలకళ ఎప్పుడు?

సాగునీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన భూములను వినియోగంలోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ఎంతో ఘనంగా ప్రారంభించినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. బోర్లతోపాటు విద్యుత్తు కనెక్షన్ కూడా అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత రూ.2 లక్షల వరకు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు అదనపు ఖర్చుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆ పథకం అలానే నిలిచిపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆ పథకం అమలుకు అతీగతీ లేకుండా పోయింది.

- బోర్ల తవ్వకాలకు నాలుగేళ్ల కిందట దరఖాస్తుల స్వీకరణ
- 5,714 మంది దరఖాస్తు చేయగా 246 మందికే అవకాశం
- ఖజానాపై భారం పేరుతో ఆపేసిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అతీగతీ లేని వైనం

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు గత వైసిపి ప్రభుత్వం సెప్టెంబర్ 28, 2020లో వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్తు కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. అనంతరం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమన్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షలోపు మాత్రమే విద్యుత్తు కనెక్షన్లకు ఖర్చు చేస్తామని అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు కూడా మంజూరు చేశారు. కానీ, ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్లు పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

అర్థాంతరంగా బోర్ల తవ్వకాలు నిలిపివేత

సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్తు స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 లక్షలు నుంచి రూ6 లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.2 లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా కనిపించడం లేదు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు విద్యుత్తు కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్ని చోట్ల విద్యుత్తు శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికైన ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్తు శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ శాఖ కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో చాలా చోట్ల మట్టి కూరుకుపోయింది. తమకు త్వరగా విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపేనా?

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు పథకాలను అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్తు కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి లేదు. దీంతో వైఎస్ఆర్ జలకళ పథకం ఉన్నఫళంగా ఆగిపోయింది. వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి తీసుకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వమే దీనిపై చొరవ చూపాల్సి ఉంది.

సమరశీల పోరాటాలకు సిద్ధం

సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

కార్మిక హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలోని ఎపిబిసిఎల్ డిపో వద్ద సిఐటియు జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత - పోరాటం.. నినాదంతో 1970 మే 30న సిఐటియు ఆవిర్భవించిందన్నారు. మొదటిలో చిన్న యూనియన్‌గా ఉన్నా సరే రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20 రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిందని గుర్తుచేశారు. ఆ దశ నుంచి ప్రస్తుతం కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలుస్తోందని చెప్పారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి సిఐటియు ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. విశాల కార్మికవర్గ ఐక్యత కోసం సిఐటియు కృషి చేస్తోందని తెలిపారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ద్వారా దోపిడీ, పీడన లేని సమాజమే సిఐటియు లక్ష్యమన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, మాన్యం రమణ, బంగ్రరాజు, రమణ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా యోగాంధ్ర కార్యక్రమాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు గ్రామీణ స్థాయి నుంచి చురుగ్గా అమలవుతున్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాంధ్ర, పిఎం సూర్యఘర్, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వివరించడానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టంచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, సిపిఒ లక్ష్మీప్రసన్న, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి, డిఎంహెచ్ఒ అనిత, డిఇఒ తిరుమల చైతన్య, ఆయుష్ కోఆర్డినేటర్ జగదీష్, టూరిజం అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం విఫలం

4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి : మాజీ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ నాలుగో తేదికి ఏడాది కావస్తోందని, ఇప్పటివరకూ సూపర్ సిక్స్ హామీలేవీ నెరవేర్చలేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. ఏడాదిలోపే టిడిపి కూటమి విఫలమైందని చెప్పారు. పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యంపై జూన్ 4న వెన్నుపోటు దినంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నిరసన ర్యాలీలు చేపడుతున్నామని, దీన్ని వైసిపి శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు వైసిపి అండగా ఉంటుందని చాటిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టి, నిరసన ర్యాలీల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని ధర్మాన సూచించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైసిపి నాయకులు గేదెల పురుషోత్తం, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, బుక్కూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసి, ఆశలపై నీళ్లు చల్లిందని చెప్పారు. ఆ బాధలను ప్రజల తరఫున వెల్లడించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జూన్ 4న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీలుగా వెళ్లి కలెక్టర్, నియోజక వర్గ స్థాయి అధికారులకు మెమోరాండం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందులో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రెండు రోజుల్లో అన్ని మండల కేంద్రాల్లో పోస్టర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు.

పోలీసులకు చిక్కిన బెట్టింగ్ ముఠా

- శ్రీకాకుళం, ఎచ్చెర్ల ప్రాంతాల్లో పందేల నిర్వహణ
- ఎనిమిది మంది అరెస్టు
- రైస్ పుల్లింగ్ కేసులో పది మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్‌పి కె.వి.రమణ

వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి కె.వి.రమణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

ఐపిఎల్ మ్యాచ్‌ల సందర్భంగా బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్న మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం అదనపు ఎస్‌పి కెవి రమణ, డిఎస్‌పి సిహెచ్ వివేకానంద.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం..

బెట్టింగ్‌పై వచ్చిన సమాచారంతో ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డి ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా పెట్టారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఈ నెల 29న ఆర్‌సిబి, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారీగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారంతో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కూడలి వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని ఆరాతీసే క్రమంలో వారి స్నేహితులు, తెలిసిన వారి నుంచి బెట్టింగ్‌కు డబ్బులు సేకరిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, బెట్టింగ్‌కు డబ్బులు చెల్లించే వ్యక్తుల వివరాలతో కూడిన రెండు నోటు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన దున్న మన్మథరావు, ఎచ్చెర్ల మండలానికి చెందిన భైరి ఉపేంద్రతోపాటు పాలక కిశోర్, కర్రి రవితేజను అరెస్టు చేశారు.

శ్రీకాకుళం రూరల్ మండలంలో..

శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామంలో మంత్రివీధిలో నివాసముంటున్న మంత్రి ధనుంజయరావు ఇంటి వద్ద క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ రాము ఆధ్వర్యాన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ధనుంజయరావు ఇంటిపై దాడి చేశారు. నిందితుడితోపాటు డి.శ్రీనివాసరావు, సంగీత లక్ష్మి.. అనే ముగ్గురు.. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రొక్కం స్వాతినాయుడు (తనూజ్) రాక కోసం చూస్తూ, క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించిన పుస్తకాన్ని పరిశీలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లను, బెట్టింగ్ వివరాలు నమోదు చేసిన పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద లభించిన రూ.8,500 నగదును సీజ్ చేశారు. తనూజ్ పరారీలో ఉన్నాడు.

ఎస్‌పి ప్రశంసలు

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నేరస్తులను పట్టుకోవడంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు. డిఎస్‌పి సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించిన సిఐలు పైడపునాయుడు, అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము, ఎఎస్ఐ కె.రమేష్ దేవ్, శ్రీనివాసరావు, పోలీస్ కానిస్టేబుళ్లు కె.దివాకర్, కె.శ్రీనివాసరావు, సిహెచ్.గణేష్, రామారావు, నారాయణరావును ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసించారు.

రైస్ పుల్లింగ్ ముఠా అరెస్ట్

అక్షయపాత్ర, రైస్ పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఇదే సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పి సిహెచ్ వివేకానంద వెల్లడించారు. ఈ నెల 29న సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నుంచి రిజర్వాయర్‌కి వెళ్లే మార్గంలో కుడి వైపున ఉన్న పాడుపడిన బంగ్లా వద్ద పురాతన రైస్‌పుల్లింగ్, అక్షయ పాత్ర క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు వారిని మధ్యవర్తుల సమక్షంలో విచారించి వారి ఫిర్యాదుపై సాయంత్రం నాలుగున్నర గంటలకు అరెస్టు చేశారు. విశాఖపట్నానికి చెందిన రవిశంకర్, అతని స్నేహితులు రుద్రరాజు, వెంకట రంగరాజు, కనకరాజు, రఘునాథరావు, మురళీకృష్ణ, గరిక శ్రీను, కొండ వెంకట నాగ సత్యనారాయణ అనే వ్యక్తులు విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కరోనా సమయంలో వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోయారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అనుభవం ఉన్న రవి శంకర్ మధ్యవర్తిత్వం ద్వారా పూని భద్రయ్య వద్ద ఉన్న రైస్ పుల్లింగ్ అక్షయపాత్ర అనే పురాతన వస్తువును రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఈ నెల 29న ఒంటి గంట సమయంలో ఐదు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా ఇస్తున్న క్రమంలో సరుబుజ్జిలి ఎస్ఐ ఎస్.హైమావతి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మొత్తం పది మందిని అరెస్టు చేశారు.

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

రైస్‌పుల్లింగ్ కేసు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ, సరుబుజ్జిలి ఎస్.హైమావతి, సిబ్బంది జనార్దనరావు, తిరుపతిరావు, గణపతిరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు, నర్సింగరావు, సంతోష్‌ను ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

రైతుల జీవనోపాధి మెరుగుపడాలి

వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రైతుల జీవనోపాధి మెరుగు పడాలని వ్యవసాయ శాఖ జెడ్డి త్రినాథస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలకపాలెంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విత్తనాలు ఎంపిక, పచ్చిరొట్ట పైర్ల ఆవశ్యకత, సాగు యాజమాన్య పద్ధతులు, నీటి నిలువ కుంటల గురించి తెలియజేశారు. రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త ఉదయ్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వరి రకాలు, వాటిలో తెగుళ్ళ, పురుగులు తట్టుకునే రకాల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు హేమ, గాంధీ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న సాగులో సూచనలు చేశారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిలు బగ్గ రజిని, భవాని శంకర్, కెవికె శాస్త్రవేత్త సునీత, ఇన్‌ఛార్జి ఎఒ దుర్గాప్రసాద్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నాయుడు, వ్యవసాయ విస్తరణ అధికారులు జగన్మోహన్, రేవతి, రైతులు చిలక రాము, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి

ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాసితులు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు సింహాచలం

ప్రజాశక్తి-మెళియాపుట్టి

ఆఫ్‌షోర్ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామమైన చీపురుపల్లిలో తొమ్మిది రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ముందుగా గ్రామంలో నిర్వాసితులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 26 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను 2008లో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారని, 17 ఏళ్లు కావస్తున్నా ప్రాజెక్టు పని నత్తనడక సాగుతోందని ధ్వజమెత్తారు. బడ్జెట్ అంచనాలు ఏటా పెరుగుతూ ఉన్నాయని, ప్రాజెక్టు పని మాత్రం పూర్తి కాలేదని ఆక్షేపించారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన చీపురుపల్లి, రేగులపాడు, దాసుపురం, సవర చీపురుపల్లి, చిన్నగురువూరు, బడగాం గ్రామాల నిర్వాసితుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సహనం కోల్పోయిన నిర్వాసితులు తొమ్మిది రోజులుగా దీక్షలు చేస్తున్నా, అధికార యంత్రాంగంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వాసితులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరలేదన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ప్యాకేజీ మంజూరు చేయాలని, నిర్వాసితులందరికీ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు సెంట్లు స్థలం ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎవ్వరి ఈశ్వరరావు, దొర విజయ్‌కుమార్, కె.కిరణ్, ధర్మాన మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి మృతి

సరుబుజ్జిలి : మండలంలోని నందికొండ కాలనీకి చెందిన కొంచాడ రామారావు (49) ఉపాధి హామీ పనికి వెళ్లి పనిచేస్తుండగానే ఆకస్మాత్తుగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఇతనికి భార్య లక్ష్మి, వివాహం కాని ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజులానే శుక్రవారం ఉపాధి హామీ పనికి నందికొండ కాలనీ దాటిన తరువాత ఉన్న నీలదెప్పి వద్దకు వెళ్లారు. పనులు చేస్తుండగా... అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. తోటి ఉపాధి కూలీలు అతని ముఖంపై నీళ్లు చల్లి సపర్యలు చేశారు. వెంటనే 108కు సమాచారం అందజేశారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ హైమావతి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, AT NARASANNAPETA
O.S. No 60/2024

Between:
Dola Bhusana Rao .....Plaintiff
And:
Dola Srinivasa Rao and 2 others ......Defendants

To,
Defendant No-2 and No-3:
1. Polaki Udayaratnam, W/o Satyam, aged about 60 years, R/o. D.No. 3-4-17, Visakha Doctors Plaza, New Bridge Road, Srikakulam Srikakulam district, Pin-532001.
2. Koyyana Umadevi, W/o. Manmadha Rao, aged about 40 years, R/o. D.No. 3-4-17, Visakha Doctors Plaza, New Bridge Road, Srikakulam Srikakulam district, Pin-532001.

NOTICE
Please take notice that the above matter stands posted on **19-06-2025** for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **19-06-2025 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

KRISHNA RAO CHELLURU @ KRISHNA MOHAN, ADVOCATE, SRIKAKULAM, CELL: 9949731123.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, AT NARASANNAPETA
IA.No.411/2024 in OS.No 60/2024

Between:
Dola Bhusana Rao .....Petitioner/Plaintiff
And:
Dola Srinivasa Rao and 2 others .....Respondents/Defendants

To,
Respondent No-2 and No-3:
1. Polaki Udayaratnam, W/o Satyam, aged about 60 years, R/o. D.No. 3-4-17, Visakha Doctors Plaza, New Bridge Road, Srikakulam Srikakulam district, Pin-532001.
2. Koyyana Umadevi, W/o. Manmadha Rao, aged about 40 years, R/o. D.No. 3-4-17, Visakha Doctors Plaza, New Bridge Road, Srikakulam Srikakulam district, Pin-532001.

NOTICE
Please take notice that the above matter stands posted on **19-06-2025** for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **19-06-2025 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

KRISHNA RAO CHELLURU @ KRISHNA MOHAN, ADVOCATE, SRIKAKULAM, CELL: 9949731123.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADL. DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P.12/2020 IN A.R.C. 405/2017

BETWEEN:
M/s Shriram City Union finance Ltd having its Registered office at 123, Angappa Naiken street Chennai and having its Administrative office At 3-6-478, 4th floor Anand Estates Liberty road Himayath nagar, Hyderabad, having its branch Office at Palasa Represented by its GPA Sri P.Ravindra represented by its G.Suresh ...Decree Holder

AND
Muvvala Deva & Others ...Judgement Debtor
To
R1) Muvvala Deva, S/o Ravana, Hindu, Age 45 years, R/o D.No.1-323, Mangali Veedhi, Vajrapu Kotturu mandal, Laxmidevpeta @ Nuvvala Revu, Srikakulam.
R2) Muvvala Balakrishna, S/o Ramana Hindu, aged 34 years. R/o D.No. 1-323. Mangaliveedhi, Vajrapukottu Mdl. Laxmidevpeta @ Nuvvalarevu, Srikakulam.
R3) L. Damodhar, S/o Thavudu, Hindu, aged 43 years, R/o H.NO, 16-1-128, Bathula Street, Palasa, Srikakulam

AGAINST WHOM IT HAS BEEN EXECUTION IS SOUGHT AGAINST THE JDR NO. 1

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 19-06-2025 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS:
Srikakulam District, Vajrapu Kotturu Md, Kasibugga Sub Registar, Vajrapu Kotturu Panchayat, Meela Kotturu alias Vajrapu Kotturu Village covered by S.No. 484/13, out of Ac 0.90 cents, 2nd row from north, on the Southern side East to West 180 feet or 54.9 meters and North to South 48 feet or 14.64 meters totaling land of 960 Sq. yards or 806.4 Sq. meters is bounded by: **East:** Chakali Pond bund, **West:** Property Sold to M. Deva, **South:** property sold to B. Raghunadh and B. Raghu, **North:** Site left for road.
DHR value : 5,00,000/-
Amine Value : 4,00,000/-
Hearing date : 19.06.2025

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Ph. No : 9849178948, 9704986271 9866509590, 9849824246

అక్రమాలపై చర్యలు

ఆర్‌డిఒ కృష్ణమూర్తి

మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై చర్యలకు రంగం సిద్ధం చేశామని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఆయన తన సమావేశ మందిరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జగనన్న కాలనీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై గత కొద్ది నెలలుగా రెవెన్యూ అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారని తెలిపారు. సర్వేలో భాగంగా ఇద్దరు తహశీల్దార్లు, ఒక టిడి, ఐదుగురు విఆర్‌ఒలు, ఒక ఇంజినీరింగ్ అధికారి, ఒక సర్వేయర్ అక్రమాలకు పాల్పడ్డారని, స్థలాలు కేటాయింపు పొజిషన్ ధ్రువపత్రాల మంజూరులో చేతివాటాన్ని ప్రదర్శించారన్న ప్రాథమిక సర్వే నివేదిక ప్రకారం వారిని గుర్తించమన్నారు. వీరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు నివేదిక అందజేశామన్నారు. ప్రస్తుతం 36 పట్టాలకు మ్యాపింగ్ జరగాల్సి ఉందన్నారు. వీటిలో 140 పట్టాలకు రెగ్యులేషన్ చేయాల్సి ఉందని, 58 ఖీవ్లబ్ స్థాయిలో ఉన్నాయని, ఒక్కో విధంగా వీటిని కేటాయించి సర్వే చేపట్టి నివేదిక తయారు చేశామన్నారు. పూర్తిస్థాయిలో నివేదిక తయారు చసిన వెంటనే కాలనీ నిర్మాణాలపై దృష్టిసారించినట్లు తెలిపారు. 30 మంది మాత్రమే నిజమైన లబ్ధిదారులు ఉన్నారన్నారు. 40 మంది పట్టాలు తప్పులుగా గుర్తించామన్నారు. 16 ఖాళీ స్థలాలు, 14 పునాదులు, ఐదు శ్లాబ్, మూర్తి పూర్తి నిర్మాణం, రెండు ఎక్కడ పట్టాలు ఇచ్చారో తెలియదని తెలిపారు. 32 స్థలాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. 56లో 23 మంది నకిలీ లబ్ధిదారులు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు.

వినతులను స్వీకరిస్తున్న రమేష్

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ఆమదాలవలస : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం ఆవరణలో టిడిపి నాయకులు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మున్సిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రజా దర్బార్ అర్జీల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సూపర్ సిక్స్ పథకాలను ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతి, సర్పంచ్ నేతింటి జ్యోతీశ్వరరావు, బి.వి.రమణమూర్తి విశ్వనాథం, తమ్మినేని శ్రీనివాసరావు, బెవర లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపు వైసిపి కార్యకర్తల సమావేశం

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గ వైసిపి కార్యకర్తల సమావేశం జూన్ 1న నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర కో–ఆర్డినేటర్ కంభంపాటి రవిబాబు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మినేని సీతారాం, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొంటారని అన్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం : జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

రణస్థలం : జెండాను ఆవిష్కరించరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు అన్నారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ వద్ద, డైమండ్ పార్కు, రిమ్స్ వద్ద సిఐటియు జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న ఆవిర్భవించిన సిఐటియు 55 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. 1970ల్లో రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20 రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచిన దశ నుంచి ప్రస్తుతం కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసిందన్నారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుత పాలకులకు ప్రజల ప్రయోజనాల కంటే ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. దోపిడీ, పీడన లేని సమాజం సిఐటియు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఆఫీస్ బేరర్ బి.మురళి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, కె.రాజు, గురుస్వామి, డి.యుగంధర్, మోహన్, టి.కుమారి, ఎం.అప్పన్న, ఎం.రమణ, సి.హెచ్.మీనాకుమారి, జి.రామలక్ష్మి, లక్ష్మీనారాయణ, అప్పలరాజు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని వరిశాం వద్ద శ్యాంపిస్టన్స్ ప్లాంట్–2 పరిశ్రమ వద్ద సిఐటియు జెండాను సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఏడుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని కార్మికులకు యాజమాన్యం చేస్తున్న బలవంతపు రిటైర్మెంట్ ఆపాలన్నారు. ఛార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించి వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.కూర్మారావు, వెంపడాపు లక్ష్మణరావు, ఎం.రమణ, దన్నాన శ్రీరామ్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ హైస్కూల్ రోడ్డులో సిఐటియు జెండాను జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.మురగన్, ఎం.రవి, శకుంతల, గురువారి, పద్మ, సంతోష్, శేఖర్, టునా నాయక్, బి.గోపి, మోహన్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని అరినాం అక్కివలస వద్ద ఉన్న శ్యామ్ పిస్టన్స్ ప్లాంట్–3 వద్ద సిఐటియు జెండాను జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.ఆదినారాయణలు ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.శ్రీనుబాబు, ఎం.సూర్యనారాయణ, కె.సంతోష్‌కుమార్, ఎన్.రమణ, జి.నాగభూషణం, వై.సత్యారావు, ఎం.నరసింహులు, బి.శ్రీను, జి.ఈశ్వరరావు, బి.కోటి పాల్గొన్నారు.

పొందూరు: కార్మిక హక్కులు కోసం సమస్యలు పరిష్కారం కొరకు ఐక్యపోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పొందూరు మండలంలో రాపాక కూడలి వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.త్రినాథరావు, బి.లక్ష్మీనారాయణ, బలరాం, వి.నీలం, డి.వెంకటేష్, వి.నాయుడు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : జెండాను ఆవిష్కరిస్తున్న అమ్మనాయుడు

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న రమణ

పలాస : జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

రెవెన్యూ అధికారుల ఇష్టారాజ్యం

- ప్రభుత్వ భూములు ధారాదత్తం
- వెలుగు చూస్తున్న అవకతవకలు

సింగన్నపాలెం పరిధిలో ఉన్న భూమి

ప్రజాశక్తి- బూర్జ

రెవెన్యూ శాఖ అధికారులు తీరు మార్చుకోవాలని, విధి నిర్వహణలో ఎటువంటి అవకతవకలు జరిగిన సహించమని మంత్రులు, నాయకులు ఆదేశిస్తున్నారు. అయినా మండలస్థాయిలో అధికారులు నిమ్మకునీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని రెవెన్యూ శాఖ అధికారులు లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మండల స్థాయిలో ఇంత జరుగుతున్న ఉన్నత అధికారులు, మండల నాయకులు స్పందించకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ రెవెన్యూశాఖ అధికారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ మిగుల భూములను తమకు నచ్చిన వారికి ఇస్తున్నారని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మండలంలోని సింగన్నపాలెం బౌండరీలో ఉన్న భూమిని నామాలలక్ష్మీపురానికి చెందిన వ్యక్తికి భూ సర్వే చేసిన అనంతరం ప్రభుత్వ మిగిలి భూమిని రెవెన్యూశాఖ అధికారులు ఓ వ్యక్తి సాగులో ఉన్న ధ్రువపత్రాలు అందజేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. భూముల క్రయవిక్రయాలు జరుగుతున్న సమయంలో పలు ప్రలోభాలకు లోబడి విక్రయించిన రైతుకే మరలా అతన్ని సాగులో భూమి ఉన్నట్లు చూపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖలో ఎన్నో అవకతవకులు జరుగుతున్నాయని అధికారులకు తెలియకుండా సిబ్బంది ఎలా పూనుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

భూముల రీ సర్వే సమయంలో ఒకరి భూమి వేరొకరి పేరున నమోదు అయ్యాయని అల్లెనకు చెందిన టంకాల వెంకట నాయుడు తెలిపారు అయితే తమ భూమిని తమ పేరుని మార్చాలని తహశీల్దార్‌కు, విఆర్‌ఒకు విన్నవించుకున్నా ఫలితం శూన్యం అన్నారు. దీనిపై విసిగిపోయిన తాను మండల కేంద్రం బూర్జలో పల్లెనిద్రలో ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్పందించి తహశీల్దార్ వై.పద్మావతిని పిలిచి ఈ సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు. అయినా ఇంతవరకు తమ భూమి తమ పేరుపైన మార్పులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఒవెన్యూ శాఖలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

రెవెన్యూ శాఖ తీరు సరికాదు

సదర్ రైతు పేరున సాగులో ఉన్నట్లు భూమిని చూపిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం. రెవెన్యూశాఖ అధికారుల తీరు సరికాదు.

– తులగాపు శ్రీనివాసరావు, రైతు సింగన్నపాలెం

ఉన్నతాధికారులు చొరవ చూపాలి

భూముల రీ సర్వేలో ఒకరి భూమి వేరే ఒకరు భూమిగా తప్పుగా పడింది. ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు చొరచూపి రెవెన్యూశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు చేపట్టాలి.

– టంకాల వెంకట నాయుడు, రైతు, అల్లెన

నిరసన తెలుపుతున్న మహిళలు

విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి – ఆమదాలవలస

మండలంలోని లొద్దలపేటకు చెందిన మహిళలు ఆర్‌టిసి బస్సు సిబ్బంది ప్రయాణికులపై వ్యవహరించిన తీరుపై నిరసన వ్యక్తం చేశారు. రోజూ శ్రీకాకుళం నుండి తాడివలస వెళ్లే పల్లె వెలుగు బస్సు రాత్రి 7 గంటల సమయంలో లొద్దలపేట వెళ్లాల్సి ఉంది. బస్సులో లొద్దలపేటకు చెందిన కొంతమంది మహిళలు, విద్యార్థులు తమ గ్రామానికి చేరుకోవడానికి ప్రయాణించారు. మార్గంమధ్యలో ఉన్న లొద్దలపేటకు బస్సు వెళ్లకుండా డ్రైవర్ కూడలి వద్ద నిలుపుదల చేసి బస్సు దిగమని చెప్పారు. రాత్రి సమయం చిమ్మ చీకటిలో సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామానికి ఎలా వెళ్లాలని విద్యార్థులు, మహిళలు బస్సు డ్రైవర్, కండక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది బలవంతంగా బస్సు నుంచి దించేసి నడుచుకొని వెళ్లిపోండని చెప్పారు. దీంతో బస్సు ముందు నిరసన తెలిపారు.

రేషన్ డిపోల్లో బోర్డులు తప్పనిసరి

డిపోను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని 58 రేసన్ డిపోల్లో తప్పనిసరిగా వివరాలు తెలిపే బోర్డులు ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ మంగం రాజశేఖర్ హెచ్చరించారు. లావేరులోని రేషన్ డిపోను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి రేషన్ డిపోల్లోనే నిత్యావసర సరుకులు అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ కార్డులకు సరుకులు సక్రమంగా అందించాలన్నారు. ఈయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, సీనియర్ సహాయకులు రత్నాకర్ కీర్తి, వెంకటరమణ, డీలర్ ఇజ్జు సత్తిబాబు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని గేటులో ఉన్న చిట్టెమ్మ క్వార్టర్స్‌లోని మెండ విమలమ్మ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యుల సమక్షంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడునని ఆ సేవా సంస్థ అధ్యక్షులు మెండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వ్యాధులు, నేత్ర వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే కెవివి డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత దంత వైద్య శిబిరం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ సెక్రెటరీ శంకర్ ప్రసాద్ కోరారు.

ఇలిసిపురంలో కొత్త కాలువల నిర్మాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పట్టణ పరిధిలోని ఇలిసిపురం కూడలి వద్ద కాలువలపై పలకలు సక్రమంగా లేక ఎన్నో రోజులు నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖంగా ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్నచిన్న ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులకు, పాలకులకు ఈ విషయమై ఎన్నోసార్లు స్థానికులు, వాహన చోదకులు విన్నవించినా ఫలితం మాత్రం కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన కాలవలు, దానిపై పలకలు సక్రమంగా అమర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతోపాటు టిడిపి నాయకులు ఇప్పిలి తిరుమలరావు, దేవల్ల విస్సులకు ఈ పనులు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దీంతో కాలువలను కొత్తగా నిర్మించి పైన పలకలు సక్రమంగా అమర్చేలా వారు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనచోదకులు, ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా థియేటర్లు తనిఖీ

ఇచ్ఛాపురం : ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇచ్ఛాపురంలోని రెండు సినిమా థియేటర్లలో సౌకర్యాలను తహశీల్దార్ ఎన్.వెంకటరావు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ఎల్ మ్యాక్స్ థియేటర్, తోట వేదిలో ఉన్న పూర్ణ థియేటర్లను తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు టిక్కెట్ల అమ్ముతున్నది, సినిమా హాళ్ల ఆవరణ, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నదీ లేనిదీ తనిఖీ చేసి ఉన్నత అధికారులకు నివేదిక అందజేశారు. రెవెన్యూ అధికారులు, థియేటర్ల యజమానులు త్రిపాఠి, పూర్ణరోల్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరావు

రైతుబజార్ ఏర్పాటు చేయాలి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో రైతుబజార్‌ను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడలోని తన స్వగృహంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ప్రకృతి సేద్యంగా రైతులు వ్యవసాయ ఉత్పత్తులు పండించి గ్రామాల్లో తీసుకువెళ్లి అమ్ముతున్నారని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో రైతుబజారు ఏర్పాటు చేస్తే అటు రైతులకు ఇటు వ్యాపారస్తులకు, వర్తకులకు అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

క్రైమ్ కార్నర్

వివాహిత ఆత్మహత్య

కొత్తూరు : మండలంలోని మహర్తాపురానికి చెందిన నిమ్మక ప్రవళిక (26) అనే వివాహిత ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన ప్రవళిక మహర్తాపురానికి చెందిన సురేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. సురేష్ భామిని మండలంలోని జియో టవర్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా భార్య ఫ్యాన్ కొక్కానికి వేలాడుతూ కనిపించింది. తోటివారితో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఏడు బైక్‌లు స్వాధీనం

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలస ప్రాంతంలో సిఐ పి. సత్యనారాయణ ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు సంచరించినా, గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, అమ్మకాలు చేపట్టినట్లు గుర్తించినా వెంటనే స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయరాదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆమదాలవలస, బూర్జ ఎస్ఐలు బాలరాజు, ప్రవళిక పాల్గొన్నారు.

భుయాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట : సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మందస మండలం చిన్నకోష్ట వద్ద నిర్వహించిన తనిఖీల్లో దయానిధి భుయాన్ 30 లీటర్ల నాటుసారా ప్యాకెట్లతో శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ జి.వి.రమణ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితుడిని రిమాండ్ తరలించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల: మండలంలోని అల్లెనగరం కూడలి వద్ద శుక్రవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. గార మండలానికి చెందిన పందిరి పాపారావు రణస్థలం మండలం పైడిభీమవరంలోని అరబిందో పరిశ్రమల కార్మికునిగా పనిచేస్తున్నారు. తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పాపారావు గాయపడడంతో 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రయివేటులో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పెద్దపాడు గురుకులం ప్రిన్సిపాల్‌గా సత్యవతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పెద్దపాడులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల (బాలికల) కళాశాల ప్రిన్సిపాల్‌గా సరెళ్ల సత్యవతి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తామరాపల్లి బాలికల గురుకులంలో తెలుగు జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సత్యవతికి రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి లభించింది. పెద్దపాడు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న బి.మాధవీలత నుంచి శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. 1996లో సర్వీసులో చేరిన సత్యవతి దుప్పలవలస, తామరాపల్లి, ఎచ్చెర్ల, నందిగాం గురుకులాల్లో సేవలందించారు. తనకు ప్రిన్సిపల్ ఉద్యోన్నతి లభించిన సందర్భంగా గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ జి.గ్రేసీ, సెక్రటరీ ప్రసన్న వెంకటేష్‌కు సత్యవతి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రిన్సిపల్స్ కృష్ణతార, రంగమణి, మాధవీలత, సిబ్బంది సీమల పుష్పవేణి, రమణయ్య, ప్రమీల, బోని భవాని, సరిత, ఝాన్సీ, అరుణ కుమారి, పూర్ణ అభినందించారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ

కొత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని మహిళ టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని బిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గడ్డెమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం శిక్షణలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. మహిళలు హాజరు, విధులు నిర్వహణలో మొదటి స్థానానికి ఇదే నిదర్శనమన్నారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఎనలేదని అన్నారు. మరిన్ని టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీరజ, నీటి సంఘం అధ్యక్షులు బోర శ్రీరాములు, నీటి సంఘం ఉపాధ్యక్షులు పడాల వెంకటకృష్ణలు పాల్గొన్నారు.

ఢిల్లేశ్వరరావు బాట అనుసరణీయం

ఢిల్లేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస

ఆయన తండ్రి ఒక ఉపాధ్యాయుడు. తన తండ్రి ఎంతో మందికి విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడం చూసి తానూ ఉపాధ్యాయ వత్తి చేపట్టాలని చిన్న తనం నుంచి ఆయన ఆశ. ఆశకు అనుగుణంగా దూర దృష్టితో ఆలోచించి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పించి నేటి పౌరులను భావితరాలకు ఆదర్శంగా ఉంటూ భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో చూడాలనే కలను నేరవేర్చడంలో 36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సఫలీకృతం అయ్యారు మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఉపాధ్యాయులు లఖినాన ఢిల్లేశ్వరరావు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మరోవైపు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారించేందుకు ఉద్యమ బాట పట్టారు. మండలంలో యుటిఎఫ్ మండల శాఖ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అక్కడితో ఆగకుండా పని చేస్తున్న ప్రాంతాల్లో పాఠశాలలను అభివద్ధి పథంలో నడిపించారు. ఈ 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

కుటుంబ నేపథ్యం

మండలంలోని లక్ష్మీపురానికి చెందిన రామయ్య, తవిటమ్మ దంపతులకు నాలుగో సంతానం లఖినాన ఢిల్లేశ్వరరావు. తండ్రి రామయ్య ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేశారు. ప్రస్తుతం ఢిల్లీశ్వరరావు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 1984లో కోటబొమ్మాళి మండలం దుక్కులపాడుకు చెందిన గురువెళ్లి పద్మని వివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వీరికి సంతోషి దీప్తి, తులసి పూర్ణిమ దీప్తి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యాభ్యాసం

మండలంలోని లక్ష్మీపురానికి ఢిశ్వరరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సొంత గ్రామమైన లక్ష్మీపురంలో విద్యను అభ్యసించారు. ఆరు నుంచి పదోత`రగతి వరకు బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో చదివారు. పలాస జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి విజయనగరం జిల్లా ఎంఆర్ కళాశాలలో బిఎ, అదే సమయంలో ఇండస్ట్రీ రిలేషన్ పర్సనల్ మేనేజ్మెంట్ కోర్సు చేస్తూ అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఇడి పూర్తి చేశారు. చదువుతున్న సమయంలో చదువులో రాణించడంతో పాటు నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకున్నారు. పౌరాణిక నాటకాలు, పగటి వేషాలు ధరించి పలువురు మన్ననలు పొందారు. ఎక్కువగా పుస్తకాలు చదవడం, ప్రపంచ దేశాల్లో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోనేందుకు ఎక్కువగా ఇష్టపడతారు.

36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో

ఢిల్లేశ్వరరావు 25 ఏళ్ల వయసులో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. మొట్టమొదటి సారిగా కోటబొమ్మాళి మండలం మంచాలపేట పాఠశాలలో 1989 జూన్ 13న ఉపాధ్యాయ వృత్తి చేపట్టి రూ.398లు జీతం తీసుకుంటూ జీవనం ప్రారంభించారు. అక్కడ ఆరు నెలలు పనిచేస్తూ రెగ్యులర్‌గా అదే మండలానికి చెందిన ఎరకయ్యా పాఠశాలలో ఏడాదిన్నర పాటు పనిచేశారు. అక్కడ నుంచి మండలంలోని మామిడిపల్లి, అమలకుడియా, గోపాలపురం, పెద్దనారాయణపురం, పండాశాసనం పాఠశాలల్లో పనిచేస్తూ చివరకు ఉద్యోగోన్నతిపై పద్మనాభపురం కాలనీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయన ఎంతో కృషి చేశారు.

1994లో యుటిఎఫ్‌లో చేరిక

ఢిల్లేశ్వరరావు 1994లో యుటిఎఫ్ సంఘంలో చేరారు. ఆ సమయంలో జిల్లాలో ఉన్న బొడ్డేపల్లి మోహనరావు, చౌదరి రవీంద్ర, జానకి రామయ్య, గొంటి గిరిధర్, అప్పారావు, మోహనరావు, గూన అప్పారావులు యుటిఎఫ్ సంఘంలో పనిచేస్తున్నారు. వారి చేసే అధ్యయనం, సామాజిక స్పృహ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో చేసిన పోరుబాట, విధానాలు, సిద్ధాంతాలకు ఆకర్షితునై యుటిఎఫ్ సంఘంలో చేరారు. అదే సమయంలో పలాస మండలంలో యుటిఎఫ్ మండల శాఖ ఏర్పాటుకు బూరెల జగ్గయ్య మాస్టర్, కంచరాన ప్రసాదరావు, తమ్మినాన ఎర్రయ్య, సనపల మోహనరావు, సోమేశ్వరరావుతో పాటు ఢిల్లేశ్వరరావు మాస్టర్ కీలకపాత్ర పోషించారు. వివిధ సమయాల్లో సుమారు ఆరేళ్ల మండల శాఖకు అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం మండలశాఖకు గౌరవ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. బ్రాహ్మణతర్ల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ కార్యదర్శిగా 19 ఏళ్లుగా పని చేస్తూ పాఠశాలలు అభివృద్ధికి కృషి చేశారు. జైసమైక్యాంధ్ర ఉద్యమంలో గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కీలక పాత్ర పోషించారు. గ్రామాల్లో పర్యటిస్తూ సమైక్యాంధ్ర వల్ల లాభ నస్టాలను ప్రజలకు అవగాహన కల్పించారు.

లక్ష్యాల పూర్తికి చర్యలు

మాట్లాడుతున్న కరుణాకరరావు

పాతపట్నం: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సిబ్బంది పనిచేసి అభివృద్ధి ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మినీ గోకులం, పశుగ్రాస పెంపకం, పశు దానా పంపిణీ, డీవార్మింగ్, వ్యాక్సినేషన్, రైతులు, సిబ్బంది శిక్షణ ద్వారా నిర్దేశించిన అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలను సాధించే వీలుంటుందని చెప్పారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మినీ గోకులం, పశుగ్రాస పెంపకంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. పశువులకు నీటితొట్ల నిర్మాణాలు వీలైనంత త్వరగా నిర్మించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ పాల ఉత్పత్తి చేసే ఆవులను, గేదెలను గుర్తించి వాటి యజమానుల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నీలి నాలుక వ్యాధి, తైలేరియా వ్యాధి, జబ్బవాపు వ్యాధి టీకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతు సేవా కేంద్రాల పరిధిలో పశువులన్నిటికీ వేయాలని సూచించారు. పశుదాన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సమావేశంలో ముందుగా కొరసవాడ పశువైద్యాధికారి పి.అనిల్ అభివృద్ధి ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలో సిబ్బంది అందరికీ వివరించారు. కార్యక్రమంలో సీది, పెద్దలోడి పశువైద్యాధికారులు బి.శ్రీవాణి, కె.మౌనిక పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కృష్ణమూర్తినాయుడు

చెరువుల అభివృద్ధికి కృషి

పాతపట్నం: ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి, మానవ సమాజానికి జీవనాధారమైన నీటి వనరులు స్వార్థపరుల చేతిలో విధ్వంసానికి గురవుతూ ఉందని, వాటిని కాపాడుకోకపోతే భవిష్యత్ అంధకారమేనని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితిని వ్యవస్థాపక అధ్యక్షులు మరిచర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. పాతపట్నంలోని ఉన్న ఎర్ర చెరువును శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పుల్లం శెట్టి మోహనరావు, డాక్టర్ సలాన శరత్ కుమార్, డాక్టర్ రేగేటి షణ్ముఖరావు, పోలబోతు రామారావు, కంటుభుక్త రాజు, ఎన్ని తిరుపతి రావు, జిల్లా అధ్యక్షుడు బి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు ఎండల మల్లన్న కళ్యాణం

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి కళ్యాణం శనివారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

అహల్యాబాయ్‌కి నివాళి

రణస్థలం రూరల్: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర నాయకులు జి.మధుకర్, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అహల్యాబాయ్‌కి చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గం బిజెపి కన్వీనర్, బంటుపల్లి సర్పంచ్ ఎస్.రజని, విజయానంద రెడ్డి, అధ్యక్షులు తేజేశ్వరరావు, మాజీ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, ఎస్.నాగేశ్వరరావు, లంక అప్పలనాయుడు, లుకలాపు అప్పలనాయుడు, టిడిపి నాయకులు ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, ఇనపకుర్తి తోటదొర పాల్గొన్నారు.

పశువుల దాణాను పంపిణీ చేస్తున్న అజయ్‌కుమార్

పశువుల దాణా పంపిణీ

నందిగాం : ప్రతి పైడి రైతూ ఆనందంగా ఉండేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్ అన్నారు. మండలంలోని నర్సిపురంలో పశువైద్యశాలలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను శుక్రవారం పంపిణీ చేశారు. మొదటి విడతగా 36 బస్తాల దానాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల బాలకృష్ణ పశువైద్య సహాయ సంచాలకులు ఎం.రవికృష్ణ, నర్సిపురం వైద్యాధికారి మన్మథరావు పాల్గొన్నారు.

రేపట్నుంచి సంబరాలు

వజ్రపుకొత్తూరు : మండలంలోని మెట్టూరులో కొండమ్మ హంకాళి గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ తెలిపింది. మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వివిధ పగటి వేశాలతోను సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మంగళవారం అమ్మవారికి చల్లదనం కార్యక్రమం చేపట్టిన తరువాత ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్నేహితులుగా 30 ఏళ్ల వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతా ఒకచోటకు చేరి ఆత్మీయ కలయిక నిర్వహించారు. మండలం మెట్టూరుకు చెందిన యువత 1995 నుంచి స్నేహితులుగా మారి 2025 నాటికి వీరు స్నేహితులుగా 30 వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైస్కూల్ ఆవరణంలో అంతా కలుసుకొని సందడి చేసారు. వీరిలో చాలా మంది దేశవిదేశాలలో ఉద్యోగాలలో స్థిరపడి ఉన్నారు. అయితే గ్రామంలో జరుగుతున్న కొండమహంకాళీ అన్న వారు సంబరాలకు అంతా గ్రామానికి రావడంతో స్నేహితుల అపూర్వకలయిక ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తొలినాళ్లలో వారు ఆడుకున్న క్రికెట్, వాటిబాల్ కబడీ ఆటలు గెలుచుకున్న బహుమతులు, గ్రామం అభివృద్ధిలో అందించిన తోడ్పాటు, పారిశుధ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న సంఘటనలు, చిన్నచిన్న అల్లర్లు గుర్తు చేసుకొని సరదగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ముగ్గురికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో ఒకేసారి తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు హైస్కూల్ గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల గోపిశెట్టి సాయికుమార్ సంతబొమ్మాళి మండలం వడ్డివాడ జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా, గణిత ఉపాధ్యాయుడు పూజారి హరిప్రసన్నకు టెక్కలి మండలం బూరగాం హైస్కూల్ హెచ్‌ఎంగా, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు లాబాల గున్నేశ్వరరావుకు నందిగాం మండలం దేవళభద్ర హైస్కూల్ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతులు వచ్చాయి. తాడివలస పాఠశాల నుంచే ముగ్గురికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు రావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయానికి ఊయల బహూకరణ

పాతపట్నం : పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి ఒడిశాకు చెందిన దంపతులు శుక్రవారం ఉయ్యాలను బహూకరించారు. ఊయల సేవకు ఒడిశా రాష్ట్రం కటక్‌పూర్‌కు చెందిన కోన మణికుమార్, పూజా దంపతులు అమ్మవారికి ఊయాల ఇఒ టి.వాసుదేవరావుకు అందజేశారు. ఊయల విలువ రూ.30 వేలు ఉంటుందని ఇఒ తెలిపారు.

సిఎంను కలిసిన భాస్కరరావు

లావేరు : మండలంలోని గోవిందపురం పంచాయతీ రామునిపాళెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు యినపకుర్తి భాస్కర రావు కడపలో నిర్వహించిన మహానాడులో సిఎం చంద్రబాబును కలిశారు. టిడిపి జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసే ప్రజలకు సేవలు సేవలందిస్తున్నారని అన్నారు. కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు.

పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

కొత్తకుంకాంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అన్నీ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేయించాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఎంపిడిఒ పి.వెంకటరాజుకు ఫోన్‌లో ఆదేశించారు. కొత్తకుంకాంలో డయేరియా కేసులు వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొత్తకుంకాంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా క్లోరినేషన్ పనులు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే మురపాక పిహెచ్‌సి వైద్యాధికారి జగదీష్, సిబ్బంది మందులను పంపిణీ చేశారు.

ఎంపికైన నాట్య కళాకారులు

రామేశ్వరానికి నాట్య కళాకారులు ఎంపిక

ఇచ్ఛాపురం : రామేశ్వరం నాట్య ప్రదర్శనకు ప్రయాణమవుతున్న శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం ఇచ్ఛాపురం నాట్య కళాకారులు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి ఆధ్వర్యాన తమిళనాడు రామేశ్వరంలో నృత్యంజలి మ్యూజిక్ అండ్ డాన్స్ ఫెస్టివల్ 2025 జూన్ 1న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. నాట్య గురువు మంగి దివ్య, నాట్య కళాకారులు సిహెచ్.భూమిక, డి.జోషిక, పి.శరణ్య, అస్మిత పూరి, ఇ.సంజన, బి.జోష్న, డి.యశోద, భవ్యశ్రీ లింమై. జి.దేవిశ్రీ మల్లిక కళాకారులు నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దలమ్మ అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం : కంచిలి మండలం చిల్లపుట్టుగలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని స్వీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబాలకు పరిహారంతో పాటు అన్ని విధాలా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

తాగునీటిని సరఫరా చేస్తున్న భవాని

తాగునీరు సరఫరా

ప్రజాశక్తి- పాతపట్నం

నియోజకవర్గ ప్రజలకు మరోసారి మానవత్వం చాటుకున్న జనసేన మహిళ కొరికాన భవాని. ఇదివరకు ఒక ట్యాంకర్‌ని ప్రారంభించి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. పాతపట్నం ప్రజల అభ్యర్ధన మేరకు తాగునీటి సరఫరాకు శుక్రవారం రెండవ వాటర్ ట్యాంకర్‌ను నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో పాతపట్నం ప్రజల కోసం మాకు తోచిన ఎటువంటి సహాయ సహకారాలైనా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నక్క కాంతి, మిరపబెల్లి బాబూరావు పాల్గొన్నారు.

పథకాలు అమలులో విఫలం

పాతపట్నం: సంక్షేమ పథకాలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మాజీ సిఎం జగన్ ఆదేశాల మేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సూపర్-6 హామీల అమలుపై ప్రశ్నిస్తూ సిఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.